23-09-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఆత్మ మరియు పరమాత్మల యథార్థ జ్ఞానము మీ వద్ద ఉంది, అందుకే మీరు సవాలు చేయాలి, మీరు శివశక్తులు"

ప్రశ్న:- అన్నింటికన్నా ఉన్నతమైన గమ్యము ఏది? దాని కొరకే పిల్లలైన మీరు పురుషార్థం చేస్తున్నారు?

జవాబు:- నిరంతరమూ స్మృతిలో ఉండడం - ఇదే అన్నింటికన్నా ఉన్నతమైన గమ్యము. స్మృతి ద్వారానే కర్మభోగము తీరి కర్మాతీత అవస్థ ఏర్పడుతుంది. ఏ మాత-పితల ద్వారానైతే అపారమైన సుఖము లభిస్తుందో, వారి గురించి పిల్లలు అంటారు - బాబా, మీ స్మృతిని మర్చిపోతున్నాము! ఆశ్చర్యము కదా. దేహీ-అభిమానులుగా ఉండే పురుషార్థము నడుస్తూ ఉన్నట్లయితే స్మృతిని మర్చిపోలేరు.

పాట:- ఈ ఆటనంతా ఎవరు రచించారు... (కిస్నే యహ్ సబ్ ఖేల్ రచాయా...)

ఓం శాంతి. భగవానువాచ - పిల్లలకు తమ తండ్రి అయిన భగవంతుని గురించి తెలుసు. ఇప్పుడు పిల్లలు వచ్చి తండ్రి ద్వారా ఆస్తికులుగా అయ్యారు, ఎందుకంటే తండ్రి ద్వారా తండ్రిని తెలుసుకున్నారు, అందుకే ఆస్తికులు అని పిలువబడతారు. తప్పకుండా మనం ఆత్మలమని, వారు ఆత్మలమైన మనకు తండ్రి అని మీకు తెలుసు. మనుష్యులెవరైనా స్వయాన్ని ఆత్మగా భావించినా కానీ పరమాత్మ గురించి ఎవ్వరికీ తెలియదు. ఎప్పుడైతే తండ్రి స్వయంగా వచ్చి పిల్లలకు జన్మనిస్తారో మరియు వారికి తమ పరిచయాన్ని ఇస్తారో అప్పుడే వారు తెలుసుకోగలరు. తండ్రియే తమ పరిచయాన్ని ఇవ్వాలి. వారు ఆత్మలకు తండ్రి. మీరు ఆత్మలు అని, నేను ఆత్మలైన మీ పరమపితను అని వారు సమ్ముఖంగా వచ్చి తెలియజేస్తారు. మీరు నిశ్చయాన్ని ఏర్పరచుకుంటారు. ఇది సామాన్యమైన విషయమే. ఆత్మలకు తండ్రి తప్పకుండా ఉన్నారు. ఆత్మ మరియు పరమాత్మ చాలాకాలం వేరుగా ఉన్నారు అన్న గాయనం కూడా ఉంది. తండ్రి గురించి పిల్లలకే తెలుసు. తండ్రి 5,000 సంవత్సరాల తర్వాత మళ్ళీ వచ్చారు. ఎప్పుడైతే పిల్లలందరూ నాస్తికులుగా, దుఃఖితులుగా అవుతారో, ఆస్తికులు ఒక్కరు కూడా ఉండరో, అప్పుడు తండ్రి వస్తారు. పిల్లల్ని ఆస్తికులుగా తయారుచేసి మళ్ళీ వారు దాగిపోతారు. ఇక ఆ తర్వాత ఎవ్వరికీ తండ్రి గురించి తెలియదు. ఇప్పుడు పిల్లలైన మీలో ఈ నిశ్చయము నంబరువారు పురుషార్థానుసారంగా ఉంది. అందరికీ పూర్తి నిశ్చయం లేదు. ఇక్కడ సమ్ముఖంగా కూర్చుని ఉన్నా, పరమపిత పరమాత్మ పతిత-పావనుడైన తండ్రి పతితుల నుండి పావన దేవతలుగా తయారుచేస్తున్నారు అని తెలిసినా, పూర్తి నిశ్చయమైతే లేదు. దేవతలవైతే ఇక్కడ కేవలం విగ్రహాలు మాత్రమే ఉన్నాయి, వారు స్వయమైతే లేరు. మనుష్యమాత్రులెవరైతే ఉన్నారో, వారిలో బ్రాహ్మణులైన మీకు తప్ప ఇంకెవ్వరికీ ఆత్మ మరియు పరమాత్మల గురించి తెలియదు. మేమే పరమాత్మ అని అనడంతో ఇక ఆత్మ గురించి గాని, పరమాత్మ గురించి గాని తెలుసుకోరు. స్వయాన్ని యథార్థ రీతిలో ఆత్మగా భావిస్తూ, పరమాత్మను తమ తండ్రిగా భావించే మనుష్యులు ఒక్కరు కూడా లేరని పిల్లలైన మీకు తెలుసు. మరి ఇప్పుడు ఈ సవాలు ఎవరు చేయాలి? శక్తులైన మీరే ఈ సవాలు చేసారు. కానీ ఏ శక్తి అయితే మీలో రావాల్సి ఉందో, ఆ శక్తి ఇంకా ఇప్పటివరకు రాలేదు. శివశక్తులైతే ప్రసిద్ధమైనవారు. జగదాంబ కూడా శక్తియే. ఇప్పుడు కాన్ఫరెన్స్ లో ధార్మిక పెద్దలందరూ వస్తారు, వారికి కూడా అర్థం చేయించాలి.

పిల్లలూ, మీరు దేహీ-అభిమానులుగా అవ్వాలి అని తండ్రి అర్థం చేయిస్తారు. మేము ఆత్మ అని, పరమపిత పరమాత్మ నుండి వారసత్వాన్ని తీసుకుంటున్నాము అని ఈ నిశ్చయం లేకపోతే, ఏదైనా సంశయం ఉంటే, ఉన్నత పదవిని పొందలేరు. మంచి-మంచి పిల్లలు కూడా నడుస్తూ-నడుస్తూ మాయా తుఫానులు తగలడంతో పడిపోతారు, నిశ్చయబుద్ధి కలవారి నుండి సంశయబుద్ధి కలవారిగా అవుతారు. లేదంటే - వీరు మా తండ్రి కారు అంటూ పిల్లలు ఎప్పుడూ సంశయబుద్ధి కలవారిగా అవ్వరు. ఇక్కడ ఇది విచిత్రము. పరమపిత పరమాత్మ ఆత్మలైన మనందరికీ తండ్రి అని, వారు మనల్ని చదివిస్తున్నారు అని - అంటారు కూడా, అయినా తండ్రిని మర్చిపోతారు. వారు రోజూ అర్థం చేయిస్తూ ఉంటారు - పిల్లలూ, మీ తండ్రిని స్మృతి చేసినట్లయితే మీ వికర్మలు వినాశనమవుతాయి. వికర్మలైతే జన్మజన్మాంతరాలవి తలపై ఉన్నాయి. మమ్మా-బాబా, ఎవరినైతే బ్రహ్మా-సరస్వతి అని అంటారో వారు నంబర్ వన్ లో ఉన్నారని మీకు తెలుసు. వారు కూడా స్వయం అంటారు - ఇంత యోగం చేస్తున్నాము, శ్రమిస్తున్నాము, అయినా కానీ అనేక జన్మల పాపాలు కట్ అవ్వలేదు. ఎంతోకొంత అనుభవించాల్సి వస్తుంది. అంతిమంలో ఈ అనుభవించడం నుండి ముక్తులై కర్మాతీత అవస్థను పొందాలి. పురుషార్థం చేయాలి. మాయ కూడా తక్కువ శక్తివంతమైనదేమీ కాదు,

ఇరువురూ సర్వశక్తివంతులే. మాయా రావణుడు మనుష్యమాత్రులందరినీ పతితులుగా చేసాడు. పతిత-పావనా అని పాడుతారు కూడా, చప్పట్లు కొడుతూ ఉంటారు, అంటే తప్పకుండా పతితులుగా ఉన్నట్లే కదా, కానీ స్వయాన్ని తాము పతితులము అని భావించరు. ఇప్పుడు ఇది పతిత ప్రపంచము అని కూడా తప్పకుండా అర్థం చేయించాలి. పావన ప్రపంచము అని సత్యయుగాన్ని అంటారు. పావన ప్రపంచంలో ఈ విధముగా పతిత-పావనుడిని పిలవరు. అక్కడైతే భారత్ చాలా సుఖవంతంగా ఉండేది, ఒకే ధర్మము ఉండేది. పరమపిత పరమాత్మ జ్ఞానసాగరుడని, వారు ఈ వేద-శాస్త్రాలు మొదలైనవాటన్నిటి రహస్యాలు తెలిసినవారని ఇప్పుడు మీకు తెలుసు. వారే ఇప్పుడు చదివిస్తున్నారు కానీ కొందరు ఎటువంటివారు ఉన్నారంటే, మమ్మల్ని పరమాత్మ చదివిస్తున్నారు అన్న విషయాన్ని కూడా వారు మర్చిపోతారు. అనంతమైన తండ్రి మమ్మల్ని చదివిస్తున్నారు, ఈ నషా ఎక్కదు. ఇక్కడి నుండి బయటకి, ఇంటికి వెళ్ళగానే నషా పూర్తిగా తొలగిపోతుంది. యుక్తియుక్తముగా పురుషార్థం చేసేవారు కష్టం మీద ఏ కొందరో ఉన్నారు. మాయ చాలా శక్తివంతమైనది. అందులో దేహాభిమానము నంబరు వన్. బాబా అర్థం చేయించారు - స్వయాన్ని దేహిగా భావించండి. మనము ఆత్మలము, ఈ శరీరము ద్వారా మనము కర్మలు చేస్తున్నాము. స్వయాన్ని ఎప్పుడూ పరమాత్మగా భావించకూడదు. తండ్రి అంటారు, నేను మిమ్మల్ని పతితుల నుండి పావనంగా తయారుచేయడానికి వచ్చాను. నన్ను ఘడియ-ఘడియ స్మృతి చేయండి. కానీ చాలా మంచి-మంచి పిల్లలు కూడా తండ్రిని స్మృతి చేయరు, మళ్ళీ సత్యము కూడా వినిపించరు. చార్టునేదైతే వ్రాసి పంపిస్తారో, అందులో కూడా అసత్యమే ఉంటుంది. సత్యమైన చార్టు వ్రాయరు. బాబా అర్థం చేయిస్తారు, స్వయాన్ని ఆత్మగా భావించండి, ఆత్మ అయిన నేను 84 జన్మలు పూర్తి చేసి ఇప్పుడు బాబా వద్దకు వెళ్తాను. ఉదయాన్నే లేచి తండ్రిని స్మృతి చేసినట్లయితే ఆ నషా రోజంతా ఉంటుంది. మనుష్యులు ధనాన్ని సంపాదించినప్పుడు, వారికి - ఈ రోజు ఇంత సంపాదించాము అన్న నషా ఉంటుంది కదా. ఇది కూడా వ్యాపారమే కావున ఇందులో ఎంతగా కష్టపడవలసి ఉంటుంది. ఎంత కష్టపడతారు అన్న విషయంలో బాబా తమ అనుభవాన్ని చెప్తారు. ఉదయమే లేచి మీతో మీరు మాట్లాడుకోవాలి. ఇప్పుడిక పాత్ర పూర్తయ్యింది, మనము ఇక వెళ్ళిపోనున్నాము, తర్వాత 21 జన్మలు రాజ్యము చేయాలి. ఎంత మధురమైన, ఎంత ప్రియమైన, అద్భుతమైన బాబా. ఇటువంటి తండ్రి గురించి మనుష్యమాత్రులెవ్వరికీ తెలియదు. తండ్రి వచ్చి పిల్లలను తమకన్నా పైకి తీసుకువెళ్తారు, కానీ పిల్లలేమో తండ్రిని సర్వవ్యాపి అని తమకన్నా కిందకు తీసుకువచ్చేసారు, అందుకే తండ్రి అంటారు, మీరు చాలా దుఃఖితులుగా అయ్యారు. నేను పిల్లలైన మిమ్మల్ని బ్రహ్మాండానికి మరియు విశ్వానికి, రెండింటికీ అధిపతులుగా చేస్తాను, కానీ పిల్లలైన మీరు తండ్రినైన నన్ను సర్వవ్యాపి అని అనేస్తారు. ఇది కూడా డ్రామాలో ఒక ఆట. ఈ-ఈ విధంగా అర్థం చేయించండి అని ఇప్పుడు తండ్రి డైరెక్షన్లు ఇస్తారు.

లక్ష్మీ-నారాయణులు మొదలైన దేవీ-దేవతలు 100 శాతము సంపన్న బుద్ధి కలవారిగా ఉండేవారు, ఇప్పుడు అలా లేరు. ఎంత తేడా ఉందో చూడండి - స్వర్గముగా ఉన్న భారత్ ఎక్కడ, అదే ఇప్పుడు నరకముగా ఉంది. ఈ జ్ఞానము మనుష్యులెవ్వరిలోనూ లేదు. పిల్లలైన మీలో కూడా ఆ శక్తి లేదు. దేహాభిమానము ఎంతగానో ఉంది. దేహీ-అభిమానులకైతే ధారణ జరగాలి కదా. ఈ-ఈ విధంగా సవాలు చేయండి అని తండ్రి డైరెక్షన్ ఇస్తారు. ఆత్మ ఏమిటో, పరమాత్మ ఏమిటో ఎవ్వరికీ తెలియదు. ఆత్మ అయిన మనము ఒక బిందువని, మన తండ్రి అయిన పరమపిత పరమాత్మ కూడా ఒక బిందువేనని మీకు తెలుసు. వారు జ్ఞానసంపన్నులు, పతిత-పావనుడు. వారు జనన-మరణాలలోకి రారు. ఆత్మలమైన మనం జనన-మరణాలలోకి వస్తాము. పరమపిత పరమాత్మ అంటారు, నాకు కూడా పాత్ర ఉంది, నేను వస్తాను, మిమ్మల్నందరినీ సుఖవంతులుగా చేసి నేను వెళ్ళి నిర్వాణధామంలో కూర్చుండిపోతాను. మనుష్యులు వృద్ధులైనప్పుడు వానప్రస్థంలోకి వెళ్ళిపోతారు, కానీ దాని అర్థాన్ని తెలుసుకోరు. వానప్రస్థము అనగా వాణికి అతీతమైన స్థానము. కానీ ఆ వృద్ధులేమైనా వాణికి అతీతంగా కూర్చుంటారా. ఇప్పుడు అందరూ వానప్రస్థులుగానే ఉన్నారు. ఆత్మలమైన మనము వాణి నుండి అతీతముగా ఉండేవారము. కానీ ఆ స్థానము గురించి కూడా వారికి తెలియదు. మీలో కూడా కొందరి బుద్ధిలోనే ఈ విషయాలు ఉన్నాయి. దేహాభిమానం ఎంతగానో ఉంది. తండ్రిని ఫాలో చేయరు. మాయ కూడా చాలా శక్తివంతమైనది. ఆత్మ మరియు పరమాత్మల సంబంధము గురించి ఎవ్వరికీ తెలియదు. తండ్రి సంబంధము గురించే వారికి తెలియదు. మీరు కూడా ఘడియ-ఘడియ మర్చిపోతారు. తండ్రికి చెందినవారిగా అయి తండ్రిని పూర్తిగా స్మృతి చేయాలి కదా. బాబా, ఘడియ-ఘడియ స్మృతి చేయడం మర్చిపోతున్నాను అని అంటారు. అరే, నీవు మాతా-పితను స్మృతి చేయడం మర్చిపోతున్నావా! నిరంతరము స్మృతి చేయడమే గమ్యము. ఏ మాతా-పిత నుండైతే స్వర్గ వారసత్వాన్ని తీసుకుంటున్నారో, మీరు వారినే మర్చిపోతున్నారా! ఆశ్చర్యము. మాతా-పిత ఒక్కరే. నేనే నీకు మాతా-పితను అని తండ్రి అంటారు. ఇవి చాలా గుహ్యమైన విషయాలు. చాలామంది జగదాంబయే తల్లి అని భావిస్తారు, కానీ అలా కాదు, ఆమె సాకార రూపధారి కదా.

మీరు నిరాకారుడినే మాతా-పిత అని అంటారు. ఈ విషయాలన్నీ ముందే చెప్పడం జరగదు. రోజురోజుకూ గుహ్యమైన విషయాలను వినిపించడం జరుగుతుంది. ఏ విషయాన్ని అయినా అర్థం చేయించలేకపోతే, ఇలా చెప్పండి - బాబా ప్రస్తుతం ఇంకా వినిపించలేదు, బాబాను అడుగుతాము. రోజురోజుకూ చాలా క్రొత్త-క్రొత్త పాయింట్లు లభిస్తూ ఉంటాయి. జ్ఞానమైతే చాలా గొప్పది. అర్థం చేసుకునేవారు అర్థం చేసుకుంటారు. కొందరు చదువుతూ-చదువుతూ అలసిపోతారు. బాబాకు వ్రాస్తారు - ఇక నేను నడవలేను, విసిగిపోయాను అని. విసిగిపోయి చదువును వదిలేస్తారు. వికారాలలోకి వెళ్తే చదువు దూరమైపోతుంది. ఈ చదువు బ్రహ్మచర్య ధారణతోనే జరుగుతుంది. ఒకవేళ బ్రహ్మచర్యాన్ని వదిలినట్లయితే ధారణ జరగదు. అటువంటివారు కామం మహాశత్రువు అని ఇతరులకు చెప్పలేరు. బుద్ధి తాళం మూసుకుపోతుంది. గమ్యము చాలా ఉన్నతమైనది.

సన్యాసులైతే గృహస్థ ధర్మాన్ని వదిలి పారిపోతారు. వారు హఠయోగీ సన్యాసులు, ఇది రాజయోగము. తండ్రియే వచ్చి రాజయోగాన్ని నేర్పిస్తారు. హఠయోగులు ఎప్పుడూ రాజయోగాన్ని నేర్పించలేరు. ఈ విషయాన్ని పూర్తిగా అర్థం చేయించే విధానము ఇంకా రాలేదు. వారిది హఠయోగ సన్యాసము, వారు పతితులను పావనంగా తయారుచేయలేరు. మీది అనంతమైన సన్యాసము, వారిది హద్దులోని సన్యాసము. మా 84 జన్మలూ పూర్తయ్యాయి, ఇప్పుడు మేము తిరిగి వెళ్తాము అని మీ బుద్ధిలో ఉంది. ఈ అనంతమైన సన్యాసము బుద్ధి ద్వారా చేయడం జరుగుతుంది. వారిది హఠయోగ కర్మ సన్యాసము. మీది రాజయోగము, కర్మయోగము, దీనిని భగవంతుడే నేర్పించారు. అది హఠయోగమని, ఇది రాజయోగమని ఇప్పుడు మీరు బాగా అర్థం చేయించగలరు. శివుడిని కూడా ఎవ్వరూ అర్థం చేసుకోరు. ఏ విధంగా ఆత్మ ఒక బిందువో, అలాగే శివుడు కూడా ఒక బిందువు. బిందువు గుర్తును కూడా భృకుటి మధ్యలోనే చూపించడం జరుగుతుంది, ఇంకెక్కడా బిందువును చూపించరు. భృకుటిలోనే బిందువును చూపించడం జరుగుతుంది. ఆత్మ కూడా ఇక్కడే నివాసముంటుంది - ఇది ఎవ్వరికీ తెలియదు. ఇంత చిన్నని బిందువులో 84 జన్మల అవినాశీ పాత్ర నిశ్చితమై ఉంది, ఇవి ఎంత లోతైన విషయాలు. కొందరికి అర్థం చేయించడం రాదు. యథార్థంగా అర్థం చేయించాలి. ఏ విధంగా ఆత్మ ఒక బిందువో అలాగే పరమాత్మ కూడా ఒక బిందువే. ఒకవేళ వేరొక ఆత్మ వచ్చినట్లయితే తాను కూడా పక్కనే వచ్చి కూర్చుంటుంది కదా. బ్రాహ్మణుడిలోకి ఆత్మను పిలుస్తారు, నేను ఫలానా స్థానంలో జన్మ తీసుకున్నాను అని ఆ ఆత్మ వచ్చి చెప్తుంది. మరి ఆ ఆత్మ ఎక్కడికి వచ్చి కూర్చుంటుంది? నుదిటిలోనా? మరి అతనిలో తన ఆత్మ కూడా ఉంది కదా. తండ్రి అంటారు, నేను కూడా బిందువును, నన్ను పరమపిత పరమాత్మ అని అంటారు. వారి మహిమ చాలా గొప్పది. శివాయ నమః అని ఈ విధంగా ఎవరు మహిమ చేసారు? సాలిగ్రామమైన ఆత్మ, అంటే తప్పకుండా ఆత్మ పేరు. ప్రపంచానికి ఈ విషయాల గురించి తెలియదు, వారికి శివ అనే ఒక్క పేరే ఉందని మీకు తెలుసు. బ్రహ్మ, విష్ణువు, శంకరులను బ్రహ్మ దేవతాయ నమః, విష్ణు దేవతాయ నమః అని అంటారు. వారిని శివ పరమాత్మాయ నమః అని అంటారు. కావున శివుడు ఉన్నతమైనవారు కదా. ఈ విషయాలను మీరే అర్థం చేసుకోగలరు. ఈ జ్ఞానము కూడా మీకు ఇప్పుడే ఉంది. ఇది మీ వజ్రతుల్యమైన జన్మ. దేవతలైతే ప్రారబ్ధాన్ని అనుభవిస్తారు. ఈ ప్రారబ్ధాన్ని ఇచ్చే తండ్రి అద్భుతమైనవారు. ఇటువంటి పారలౌకిక తండ్రిపై ఎంత గౌరవాన్ని ఉంచాలి. బుద్ధియోగము ఈ బ్రహ్మతో కాదు, వారితో ఉంచాలి. ఆ తండ్రి వీరి ద్వారా చదివిస్తారు, ఈ శరీరాన్ని అద్దెకు తీసుకున్నారు. వీరు మొత్తం సృష్టి అంతటిలో ఎంత గొప్ప అతిథి. శివబాబా పరంధామం నుండి వస్తారు. వీరు భారత్ కు ఎంత గొప్ప అతిథి. వీరు ఎక్కడి నుండి వచ్చారు? ఆ మినిస్టర్లు మొదలైనవారికి ఎంత గౌరవముంటుంది. వీరు గుప్త వేషంలో వచ్చిన ఎంత గొప్ప అతిథి, పతితులను పావనులుగా తయారుచేయడానికి వచ్చారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఉదయముదయమే లేచి స్మృతిలో కూర్చొని సంపాదనను జమ చేసుకోవాలి. మీతో మీరు మాట్లాడుకోవాలి. దేహీ-అభిమానులుగా ఉండాలి.

2. రాజయోగాన్ని, కర్మయోగాన్ని నేర్చుకోవాలి మరియు నేర్పించాలి. ఎప్పుడూ కూడా విసుగు చెంది చదువును వదలకూడదు. తండ్రిపై తప్పకుండా గౌరవాన్ని ఉంచాలి.

వరదానము:- తండ్రి సమానంగా అనంతమైన వృత్తిని ఉంచే మాస్టర్ విశ్వ కళ్యాణకారీ భవ

అనంతమైన వృత్తి అనగా సర్వ ఆత్మల పట్ల కళ్యాణ వృత్తిని ఉంచటము - ఇదే మాస్టర్ విశ్వ కళ్యాణకారిగా అవ్వటము. కేవలం మీ కొరకు లేక హద్దులో మీరు నిమిత్తమైయున్న ఆత్మల కళ్యాణము కొరకే కాదు, కానీ సర్వుల కళ్యాణము చేయాలనే వృత్తి ఉండాలి. ఎవరైతే తమ ఉన్నతిలో, తమ ప్రాప్తిలో, తమ పట్ల సంతుష్టతలో రాజీగా అయ్యి నడుస్తారో, వారు స్వ-కళ్యాణీ. కానీ ఎవరైతే అనంతమైన వృత్తిని ఉంచి అనంతమైన సేవలో బిజీగా ఉంటారో, అటువంటివారిని తండ్రి సమానమైన మాస్టర్ విశ్వ కళ్యాణకారీ అని అంటారు.

స్లోగన్:- నింద-స్తుతిలో, మాన-అవమానాలలో, హాని-లాభములలో సమానంగా ఉండేవారే యోగీ ఆత్మలు.